"వారంరోజుల పాటు బంగాళాదుంపల సంచీని మోసిన అనుభవం ఎలా ఉంది మీకు?"

వెంటనే శిష్యులంతా ఆ వారంపాటు ఆ బరువైన, వాసనవేసే బంగాళాదుంపల సంచీలని మోయడంలోని బాధని ఏకరువు పెట్టారు.

అప్పుడు గురువు వాళ్ళతో ఇలా చెప్పాడు.

"ఇతరులమీద మీరు పెంచుకున్న ద్వేషాన్ని మీ హృదయంలో మోస్తున్నప్పుడు కూడా జరిగేది ఇదే. ఆ ద్వేషం తాలూకు చెడు వాసన, బరువు మీ హృదయాన్ని పాడు చేస్తాయి. ఒక్క వారం రోజులే మీరు బంగాళాదుంపలని భరించలేక పోయారు. మరి జీవితాంతం ఇతరుల మీద మీకు గల ద్వేషం బరువు, వాసనలని ఎలా భరించగలరు? మన శత్రువులని క్షమించడమంటే మనం వారికి సేవ చేయడం కాదు. మనకి మనమే సేవ చేసుకోవడం. మనల్ని మనమే ఉద్ధరించుకోవడం."

శిష్యులకి అంతకాలం, తమ గురువు పదే పదే క్షమాగుణం గురించి బోధించిందంతా ఒక్క క్షణంలో అర్థమైంది. ఆ తర్వాత వారంతా తమకి ద్రోహం చేసిన వారందరి మీదా గల ద్వేష భావాన్ని క్రమంగా పోగొట్టుకున్నారు.

## 53. ప్రత్యేక గారెలు

ఓ గ్రామ సమీపంలోని ఓ అడవిలో ఒక ఆధ్యాత్మిక గురువు ఉండేవాడు. ఆయన దగ్గర అనేకమంది శిష్యులు సాధన చేస్తూండేవారు.

ఏటా ఆ ఊళ్ళో ఓ ఉత్సవం జరుగుతుంది. దానికి అనుబంధంగా అనేక వినోద కార్యక్రమాలు కూడా జరుగుతూంటాయి. శిష్యులు ఆ ఉత్సవం చూడాలనుకున్నారు కాని, అక్కడ దొమ్మరిసాని ఆటలు కూడా జరుగుతూండటంతో ఆ గురువు వాళ్ళని అక్కడకి వెళ్ళడానికి అనుమతించలేదు.

ఓ ఏడు శిష్యులంతా ఎలాగైనా గురువుగారిని, తాము అక్కడకి వెళ్ళడానికి వప్పించాలని ఆలోచించారు. వారు గురువు దగ్గరకి వెళ్ళి చెప్పారు.

"స్వామీ! మేం ఆ ఉత్సవం చూసి వచ్చేస్తాం తప్ప కోడి పందాలు, ఇతర ఆటలు చూడమని మీకు హామీ ఇస్తున్నాం. దయచేసి మాకు అనుమతి ఇవ్వండి."

శిష్యుల మనస్సుల్లోని ఆ గట్టి కోరికని గమనించిన గురువు చిరునవ్వు నవ్వి అంగీకారంగా తల ఊపాడు. వాళ్ళంతా ఎంతో ఆనందించారు.

మర్నాడు శిష్యులంతా గ్రామానికి బయలుదేరబోయే ముందు గురువు వారితో చెప్పాడు.

"మీరా గ్రామం చేరేసరికి చాలా సేపవుతుంది. మీ కోసం ప్రత్యేకంగా నేను నేతి గారెలు చేసాను. వాటిని తిని వెళ్ళండి."

ఆయన వాళ్ళకి ఆకుల్లో వేడి, వేడి గారెలు వడ్డించి చెప్పాడు.

"మేలి రకం మినుములని నానబెట్టి, రుబ్బి, ఆ పిండిలో అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, మిరియాలు కలిపి, నేతిలో దోరగా వేయించి చేసాను. అయితే దీంట్లో ఎప్పుడూ, ఎవరూ వేయని ఓ కొత్త పదార్థం కూడా వేసాను. కాబట్టి దాన్ని అసహ్యించుకోకుండా తినండి."

"మేం అసహ్యించుకునే ఆ కొత్త పదార్థం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడో శిష్యుడు.

"పంది పెంట." తడుముకోకుండా జవాబు చెప్పాడా గురువు.

శిష్యులా జవాబుకి అదిరి పడ్డారు.

"మరిగే నూనెలో వేయించ బట్టి దానిలోని హాని చేసే బేక్టీరియా అంతా నాశనం అయివుంటుంది కాబట్టి అది మీకు అనారోగ్యం కలిగిస్తుందనుకోను. అయినా జాగ్రత్తగా చూసుకుని, అదున్నమేర వదిలి తినండి."

"ఛీ! ఈ గారెలని మేం ఎలా తినగలం?" అసహ్యించుకుంటూ ఆకులని దూరంగా తోసేసారు శిష్యులంతా.

"దొమ్మరిసాని ఆట ఎటు జరుగుతోందో అటు వైపు వెళ్ళనట్లుగానే, అదే ప్రజ్ఞని ఇక్కడ కూడా మీరు ఉపయోగించచ్చుగా!"

శిష్యులకి గురువు తమకి బోధించదలచుకున్న పాఠం అర్థమవడంతో మళ్ళీ ఎన్నడూ ఆ ఉత్సవానికి వెళ్ళే ఆలోచన చేయలేదు. అంతేకాక ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారు దైవం మీద తప్ప మనసుని ప్రాపంచిక సుఖాల మీద పెట్టరాదన్న పాఠాన్ని కూడా నేర్చుకున్నారు.

## 54. ముగ్గురు శిష్యులు

కొంతకాలం తన దగ్గర ఆధ్యాత్మిక విద్యని అభ్యసించిన ముగ్గురు శిష్యులకి, తను బోధించింది ఎంతదాకా పట్టుబడిందో తెలుసుకోవాలన్న తలంపు ఓ గురువుకి కలిగింది. అందుకు వారికో పరీక్ష పెట్టాడాయన. ఆ ముగ్గురినీ పిలిచి మూడు కపాలాలు చూపించి అడిగాడు.

"ఈ మూడిటిలో ఏది ఓ మహాత్ముడికి చెందిందో మీరు కనుక్కోగలరా?"

ఓ శిష్యుడు ఆ మూడింటి బరువుని తూచి, ఎక్కువ బరువున్న కపాలం మహాత్ముడికి చెందిందిగా నిర్ణయించాడు.

రెండో శిష్యుడు ఆ మూడిటిలో ఏది ఎక్కువ తెల్లగా ఉందో పరిశీలించి చూసి, ఆ కపాలం మహాత్ముడికి చెందిందిగా నిశ్చయించాడు.

మూడో శిష్యుడు ఓ పొడవాటి దర్భపుల్లని తీసుకుని దాన్ని మొదటి కపాలం చెవిలోంచి పోనించాడు. అది రెండో చెవిలోంచి బయటకి వచ్చింది.

"స్వామీ. ఇది సామాన్యుడికి చెందిన కపాలం. ఇతను తను విన్న మంచి మాటలు ఓ చెవిలోంచి ఇంకో చెవి ద్వారా బయటికి వదిలేసే మనిషి."